క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధులకు సన్మానం

కొడంగల్ : పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అధిక ధరలకు పుస్తకాల విక్రయం



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తాండూరు టౌన్ : ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన పుస్తకాలు, మెటీరియల్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. తాండూరు పట్టణం చించోళి రోడ్డు మార్గంలోని ఓ షట్టర్‌లో స్మార్ట్ కిడ్స్ స్కూల్‌కు సంబంధించిన పుస్తకాలు, స్కూల్ మెటీరియల్స్‌ను విక్రయిస్తున్నారని తెలిపారు. సదరు పాఠశాల ప్రొద్బలంతోనే ఎలాంటి అనుమతి తీసుకోకుండా షట్టర్‌లో విక్రయిస్తున్నారని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దీపక్‌రెడ్డి, సిరియాల వినతిపత్రంలో కోరారు.

రోడ్డుకు మరమ్మతులు

హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. గత కొంతకాలంగా పట్టణంలోని శేష్‌ప్రభ థియేటర్ నుంచి గౌతపూర్ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాండూరు మండలంలోని 30 గ్రామాల ప్రజలు గౌతపూర్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి గుంతల్లో వర్షం నీరు చేరి పూర్తిగా గుంతలమయంగా తయారయ్యింది. మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో మంగళవారం శేష్‌ప్రభ థియేటర్ నుంచి గౌతపూర్ వరకు రోడ్లకు మరమ్మతుల చేపట్టారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ కళాశాలలో కొత్త గ్రూపులు



గ్రూపులు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ కొత్త గ్రూపులు ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు తాజాగా ఒకేషనల్ ఎంపీహెచ్‌ఎస్, ఎంఎల్‌టీ గ్రూపులను ప్రారంభించామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. మండల విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, పలు గ్రామాల్లో జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం పర్యటించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం హరిలాల్, ఉపాధ్యాయ బృందం వెంకటయ్య, బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తైబజారు వేలం వాయిదా



హస్నాబాద్‌లో నిర్వహించిన వేలం

దుద్యాల్ : మండలంలోని హస్నాబాద్ గ్రామంలో తైబజార్ వేలం గురువారానికి వాయిదా పడింది. మంగళవారం నిర్వహించిన వేలం పాటకు గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎవరూ సుముఖత చూపలేదు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత ఏడాది వేలం దక్కించుకున్న వారు చాలా నష్టపోయారని, టెండరు విలువ తగ్గిస్తేనే వేలం పాటలో పాల్గొంటామని తెల్చి చెప్పారు. గ్రామంలో జరిగే చిన్న సంతకు ఇంత పెద్ద మొత్తమా అని ప్రశ్నించారు. దీంతో ఎవరూ కూడా వేలంలో పాల్గొనకపోవడంతో తైబజార్ వేలం గురువారానికి వాయిదా పడింది.

గడువు దాటిన సిలిండర్లతో జాగ్రత్త!

- ప్రమాదాలు జరిగే అవకాశం
- 12 నెలలు ఏ, బీ, సీ, డీ కోడ్‌లుగా గుర్తింపు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



దుద్యాల్ గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్న వాహనం



సిలిండర్‌పై గడువు కోడ్

దుద్యాల్ : నిత్యావసరాల్లో మనం వినియోగించే వస్తువుకూ గడువు తేదీ ఉంటుంది. అలాగే, గ్యాస్ సిలిండర్‌కు కూడా గడువు తేదీ ఉంటుంది. కాలంచెల్లిన సిలిండర్లను వినియోగించడం ప్రమాదకరం. సిలిండర్‌పై ఉండే గడువు తేదీలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన దాఖలాలు మండలంలో ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సిలిండర్‌పై తేదీని ఇలా గుర్తించండి..

ప్రతి ఇంటిలో గ్యాస్ సిలిండర్ వినియోగం తప్పనిసరిగా మారిపోయింది. గ్యాస్ ఏజెన్సీల నుంచి సిలిండర్ తీసుకోగానే దానిపై ఉన్న గడువు తేదీని తప్పక గుర్తించాలి. సిలిండర్ రింగ్ కింద భాగంలో గడువు తేదీని ముద్రించి ఉంటుంది. సంవత్సరంలో ఉండే 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఏ, బీ, సీ, డీ గా ఆంగ్లం అక్షరాలను ముద్రిస్తారు. అక్షరం ఏ అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ- ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించినదిగా , సీ- జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు, డీ అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌కు సంబంధించినదిగా గుర్తించాలి. సిలిండర్ డెలివరీ అయిన వెంటనే సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి సిలిండర్ ఏ నెలకు చెందినతో తెలుసుకోవాలి. ఒక వేళ గడువు తీరిన సిలిండర్ ఇస్తే తిరిగి ఏజన్సీవారికి ఇచ్చి గడువు ఉన్న సిలిండర్ తీసుకోవాలి.

గడువు తిరితే ప్రమాదమే!

సిలిండర్‌ను ఎక్కువ కాలం వాడకుండా పక్కన పెట్టి, కొన్ని రోజుల తర్వాత వాడటం వల్ల అది ప్రమాదంగా మారవచ్చు. సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి అది ఏ నెలకు చెందినతో తెలుసుకొని వాడుకుంటే మంచిది. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు సిలిండర్లపై ఉండే గడువు కోడ్‌ను గుర్తించడం ఎలా అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వృథాగా ఉంచకండి.. వాడుకలోకి తెండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్: ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆడిటోరియాన్ని వృథాగా ఉంచక .. వాడుకలోకి తీసుకురావాలని అధికారులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశించారు. తాండూరు మండలం అంతారం గుట్టపైన రూర్బన్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన ఆడిటోరియాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అందులోని గదులు, టాయిలెట్ల సౌకర్యాలు, తాగునీటి వసతి గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఆడిటోరియం అనుకూలంగా ఉంటుందన్నారు. ఆడిటోరియం సౌకర్యాలకు ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షల ఇస్తానని హామీ ఇచ్చారు. అసరమైతే మండల నిధులను ఉపయోగించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ను కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలన్నారు. తాండూరు అభివృద్ధికి ఎన్ని నిధులైన తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభరాణి, ఎంపీటీసీ శాంతుకుమార్, మాజీ సర్పంచు వడ్డె శేఖర్, పంచాయతీ రాజ్ డీఈ వెంకట్రావ్, ఏఈ నందిని, ఎంపీడీఓ విశ్వప్ర సాద్, అంతారం గ్రామ ప్రత్యేకాధికారి జీ. విజయేందర్, ఎంపీఓ రతన్ సింగ్, కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న కొడంగల్ ఎంపీడీఓ ఉషశ్రీ

పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోండి

ఎంపీడీఓ ఉషశ్రీ

సాక్షి ఎఫెక్ట్..



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ , తదితరులు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో కొడంగల్ ఎంపీడీఓ ఉషశ్రీ మంగళవారం పర్యటించారు. సోమవారం సాక్షిలో వచ్చిన సీజనల్‌పై అప్రమత్తత ఏదీ అనే కథనానికి స్పందించిన ఆమె గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉషాశ్రీ మాట్లాడుతూ.. గ్రామంలో చెత్తకుప్పలు, మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదాని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్మికులకు జీతాలు లేకపోవడంతో విధుల్లోకి రావడం లేదని అందుకే చెత్తకుప్పలు తీయడం లేదని పంచాయతీ కార్యదర్శి వివరించారు. అసలే వర్షాకాలం వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలన్నారు.

అర్హులందరికీ న్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్ : అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సాయం అందుతుందని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో పీఏసీఎస్ అధ్యక్షుడు కటుకం శివకుమార్ గుప్తా అధ్యక్షతన రైతు భరోసా సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు, రైతు బంధు ఇవ్వాలన్నారు. సాగులో లేని భూములు, కొండలు, గుట్టలు, ప్లాట్లు చేసిన భూములకు రైతుబంధు ఇవ్వొద్దని సూచించారు. సన్న, చిన్నకారు రైతులకు రైతు భరోసా పెంచాలని కోరారు. కూలీల రేట్లు పెరిగిపోయాయని వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు. అనంతరం ఎంపీపీ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారని అన్నారు. త్వరలో అర్హులైన రైతులందరికీ రైతుబంధు అందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఓ లావణ్య, ఈఏఓలు సుమ, రాజు పాల్గొన్నారు.

నేడు రైతు భరోసా సమావేశం

మోమిన్‌పేట: రైతు భరోసా సమావేశం నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉ. 2గంటలకు మేకవనంపల్లిలోని పీఏసీఎస్ ఆవరణలో రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు రైతుభరోసా పథకంపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అలాగే, మోమిన్‌పేట పీఏసీఎస్ పరిధిలోని రైతు వేదికలో ఉ.11గంటలకు రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. సమావేశానికి జిల్లా వ్యవసాయాధికారి హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు టీఆర్‌జేకేఎస్ సమావేశం

బొంరాస్‌పేట: తెలంగాణ జానపద కళలను ఆదరిస్తూ, కళాకారులను కాపాడటంలో భాగంగా బుధవారం రాష్ట్ర జానపద సంఘం(టీఆర్‌జేకేఎస్) రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమావేశం, కొండల్‌రావుకు సన్మానం, జానపద ప్రదర్శనలు కోలాటం,భజన బృందాలు ఉంటాయన్నారు.

నేడు ప్రత్యేక పూజలు



స్వామివారి మూలమూర్తి

కొడంగల్ : పట్టణంలోని పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవం సందర్భంగా శ్రీవైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో పూజలు చేయనున్నట్లు వివరించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు పరామర్శ



నర్సింలును పరామర్శిస్తున్న రవిగౌడ్

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన ఎల్మకన్నె పీఏసీఎస్ డైరెక్టర్ పెండ్యా నర్సింలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, ఎంపీటీసీ శాంతుకుమార్, కొస్గి ఆశన్న, జంగని నర్సింలు, పుల్లప్ప, ప్రకాష్ ,విశాల్, ఏసు, సంగెం శ్రీనులు ఉన్నారు.



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్

తాండూరు: పార్లమెంట్ సాక్షిగా హిందుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్‌గాంధీ హిందుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దేశాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని అన్నారు. 10 ఏళ్ల బీజేపీ ప్రభుత్వంలో దేశాన్ని ఆర్థిక, అభివృద్ధి పథంలో ముందుకు నడిపించి ప్రపంచంలోనే టాప్ టెన్ దేశాల వరుసలో నిలిచేలా పాలన సాగించారని తెలిపారు. పార్లమెంట్ ప్రతిపక్షహోదాలో ఉంటూ, హిందూత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై దేశ ప్రజలను అవమానించడమేనని అన్నారు. హిందువులకు రాహుల్‌గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ అంతారం లలిత, బాలప్ప, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజినికాంత్, నాయకులు పూజారి పాండు, దోమకృష్ణ, అంతారం కిరణ్ తదితరులున్నారు.



పరిగి: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

పరిగి: పార్లమెంట్ సాక్షిగా హిందువులను కించపరిచిన రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణకేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందువులకు వ్యతిరేకంగా ఒక ప్రణాళికతో సనాతన ధర్మాన్ని కించపరిచేలా, హిందూత్వాన్ని నాశనం చేసే విధంగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. దేశంలో హిందువులు హింసకు ప్రేరేపిస్తే దేశంలో ఇతర మతస్థులు ఉండేవారా అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి హిందువులు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో మునగసాగు

దానిమ్మ, జామ, నిమ్మ, కొబ్బరికి ప్రాధాన్యం

ధారూరు: పండ్ల తోటల పెంపకానికి, సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సహిస్తుందని ఎంపీడీఓ నర్సింహులు, ఏపీఓ సురేష్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యానికి మేలు చేసే మునగ సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే, దానిమ్మ, జామ, నిమ్మ, మామిడి లాంటి పండ్ల తోటలు.. వాటి చుట్టూ కొబ్బరిచెట్లు నాటేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. 2024-25 సంవత్సరానికి ధారూరు మండలంలో 50 ఎకరాల్లో వీటిని సాగు చేయడానికి రైతులను సమాయత్తం చేస్తున్నామన్నారు. మునగసాగు చేయడానికి ఎకరాకు 100 మొక్కలు, అలాగే, మామిడికి ఎకరాకు 70 మొక్కలు, నిమ్మ ఎకరాకు 110, జామ ఎకరాకు 110 సరిపోతాయన్నారు. పొలం చుట్టూ గట్లపై కొబ్బరి చెట్లను నాటితే 40 మొక్కలు కావాల్సి ఉంటుందని వారు వివరించారు. రైతులు ముందుగా తమ సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసి నాటుకోవాల్సి ఉంటుంది. మొక్కల ధరను తర్వాత నగదు రూపంలో ఈజీఎస్ నుంచి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. వీటితో పాటు డ్రాగన్‌ఫ్రూట్స్‌ను కూడా సాగు చేయచవ్చని వారు సూచించారు. సాగు చేసే వారు స్వగ్రామానికి చెందిన వారై ఉండాలని, పట్టాపాసుబుక్కు, జాబ్‌కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే, పొలంలో నీటి వసతి ఉండాలని సూచించారు. రియల్టర్లు, పెద్ద రైతులకు ఈ పథకం వర్తించదని స్పష్టం చేశారు. సన్న, చిన్నకారు రైతులై ఉండాలన్నారు. ఇంతకుముందు ఉద్యావనశాఖ ద్వారా పర్యవేక్షణ జరిగేదని, సబ్సిడీ ప్రయోజనం ఉండేదని ప్రస్తుతం ఉపాధిహామీ ద్వారానే పండ్ల తోటల పెంపకం జరుగుతుందని తెలియజేశారు. వీటి సాగుకు అన్ని రకాల ప్రోత్సాహం ఉంటుందని, పూర్తి వివరాల కోసం మండల పరిషత్ కార్యాలయాన్ని లేదా ఉపాధి హామీ ఏపీఓ లేదా గ్రామ కార్యదర్శిని సంప్రదించాలని రైతులకు సూచించారు.

హద్దుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ : మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 19లోని భూములను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. అలాగే, అంగీకార పత్రాలు ఇచ్చిన రైతులతో మాట్లాడారు. వారి భూములకు సంబంధించిన హద్దులను గుర్తించారు. కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాలను అప్పాయిపల్లిలో నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ నర్సింలు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి భూములు ఇస్తున్న రైతులు వారి పొలాల హద్దులను అధికారులకు చూపించారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమిని సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు రూ.10లక్షలు, ఉద్యోగం, ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించనున్నట్లు చెప్పారు.

ప్రతీ హామీ అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి

మర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువత కోసం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్ అమలు చేసి, విడతల వారీగా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు సీహెచ్ మధుకర్ బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు నాయకులు ఉన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

కుల్కచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యా రెడ్డి అ న్నారు. మండలంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ఏర్పాటు చేస్తామని, ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదని మండిపడ్డారు.

సంక్షిప్త వార్తలు

◆ పడిపోయిన విద్యుత్ స్తంభం

తాండూరు రూరల్: మండలంలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌లో వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం పడిపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. రైతులు పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఓ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఎంపీటీసీ శాంతుతో కలిసి రైతులు విన్నవించుకున్నారు.

◆ భగీరథ నీటిని సరఫరా చేయాలి

బంట్వారం: మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. గతంలో పని చేసిన బోర్‌వెల్స్, చేతి పంపులు, మంచి నీటి బావులు వినియోగంలో లేకుండా పోయాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పని చేస్తూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

◆ డిమాండ్లను పరిష్కరించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జూలై 24 అనంతరం ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కనీస వేతనాలు రూ. 26,000 చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. పాత జీఓ 10ని అమలు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. లేని యెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ కార్యదర్శి భారతి జిల్లా కమిటీ నాయకులు లక్ష్మీవనజ మంజుల పర్వతమ్మ అంబాభాయ్ మనోహర కవిత పుల్లమ్మ పాల్గొన్నారు.

◆ తాగునీటి ఎద్దడి పరిష్కారానికి కృషి

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్ గ్రామంలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఏ విద్యార్థిని అడిగిన సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిని వెల్లగక్కలేమని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

◆ బాల్య మిత్రుల ఔదార్యం

కొడంగల్ : పట్టణానికి చెందిన పలువురు బాల్య మిత్రులు 2009లో బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తమవంతు సాయం చేస్తున్నారు. తాము సంపాదించిన సొమ్ములో ప్రతి నెలా కొంత మొత్తం జమ చేసి పేద విద్యార్థులకు చేయూత నందిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 400 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఐనన్‌పల్లి, చిట్లపల్లి, పోషమ్మతండా, మైసమ్మ తండా, ఖాజా అహ్మద్‌పల్లి, సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, అన్నారం, బొంరాస్‌పేట మండలంలోని నాస్కాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో అందజేశారు. ప్రజలు, మాజీ సర్పంచులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో నగేష్, కిట్టుస్వామి, లక్ష్మీనారాయణ జోషి, మురహరి వశిష్ఠ, కటుకం శివకుమార్ పాల్గొన్నారు.

◆ విద్యావలంటీర్లను నియమించాలి

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ బదిలీలతో ఖాళీగా ఉన్న పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా విద్యావలంటీర్లను నియమించాలని టీఎస్ యూటీఎఫ్ సంఘం మండలాధ్యక్షుడు గొరారం గోపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కారు పాఠశాలలను బలోపేతం చేస్తామన్న ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలతో పాటు డీఎస్సీ పూర్తయిన తాత్కాలిక ఉపాధ్యాయులుగా విద్యావలంటీర్లను నియమించి ఉపాధ్యాయులు కొరతను తీర్చాలని అన్నారు. లేదంటే విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్, కార్యదర్శి రమేశ్, లక్ష్మయ్య, చిరంజీవి, నాయుడు ఉన్నారు.